# News Item in Various News Papers on 02-11-2016

## In EENADU

# హైటెక్స్‌లో జాతీయ సదస్సు

- ఈనెల 15 - 18 వరకు నిర్వహణ
- కొత్తగా 2,656 కి.మీ జాతీయ రహదారులు: మంత్రి తుమ్మల

ఈనాడు - హైదరాబాద్: హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఈనెల 15 నుంచి 18 వరకు ఇండియన్ రోడ్ కాంగ్రెస్ జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ సదస్సుకు 3 నుంచి 5 వేల మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. రూ.1,020 కోట్ల కేంద్ర నిధులతో 85 పనులు చేపట్టనున్నామని, ఇప్పటికే 35 పనులకు టెండర్లు పిలిచామన్నారు. ప్రతి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి రెండువరుసల రహదారుల్ని నిర్మించనున్నట్లు వెల్లడించారు. గత రెండేళ్లలో రోడ్లు భవనాల శాఖ ప్రగతిని గురువారం ఆయన సమీక్షించారు. జాతీయ రహదారుల అభివృద్ధి పథకం కింద రూ.2 వేల కోట్ల పనులకు అనుమతులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. 2,656 కి.మీ నూతన రహదారులకు అనుమతులు సాధించామన్నారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో 26 రోడ్లు, 5 వంతెనల నిర్మాణానికి రూ. 1,590 కోట్లు మంజూరయ్యాయన్నారు. తెలంగాణలో 4,314 కి.మీ పొడవైన 459 జిల్లా, రాష్ట్ర రహదారుల నిర్మాణం చేపట్టామని తెలిపారు.

**ఎర్రమంజిల్‌లో పూర్తయిన నిర్మాణం:** ఎర్రమంజిల్‌లో రూ.69కోట్ల ఖర్చుతో రోడ్లు, భవనాల శాఖ ప్రధాన కార్యాలయ నిర్మాణంపూర్తి చేశామని మంత్రి పేర్కొన్నారు. 95నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల నివాస, కార్యాలయాల భవనాలను ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. 31జిల్లాల ప్రధాన పట్టణాల్లో అతిథి గృహాలనిర్మాణం చేపట్టనున్నట్లు ప్రకటించారు.

### మహిళల భద్రతకు హెల్ప్‌లైన్

మహిళలకు భద్రత, రక్షణ కల్పించేందుకు మహిళా హెల్ప్‌లైన్ (181) ఏర్పాటు చేయనున్నట్లు మహిళాశిశు సంక్షేమశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. లైంగిక వేధింపులు, అక్రమ రవాణా, వరకట్న బాధితులకు రూ.2.24కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించామన్నారు. మహిళా సాధికారిత కోసం పూర్ణశక్తి కేంద్రాన్ని కేంద్రం నల్గొండకు మంజూరు చేసిందన్నారు. గురువారమిక్కడ మహిళాశిశు సంక్షేమశాఖపై సమీక్ష నిర్వహించారు. దత్తత ప్రక్రియ సరళీకరణతో 449 మంది పిల్లలను దత్తత ఇచ్చామన్నారు. ఆపరేషన్ ముస్కాన్, స్మైల్ కింద 13018 మంది పిల్లల్ని రక్షించామని, తప్పిపోయిన 1527 మంది పిల్లల్ని గుర్తించామని వివరించారు. రెండేళ్లలో 2886 బాల్యవివాహాలు నిలిపివేశామని ప్రకటించారు.

## In Namaste Telangana

WWW.NAMASTHETELANGAANA.COM

# ప్రభుత్వంపై బురద జల్లితే సహించం

### ప్రతిపక్షాలపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధ్వజం

**ప్రతిపక్ష నేతలు చేస్తున్న అర్థంపర్థం లేని పోరుయాత్రలు, పాదయాత్రలు కాళ్ల తిమ్మిరులు వదిలించుకోవడానికే తప్ప ప్రజలు వారిని ఆదరించే పరిస్థితి లేదని రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మండిపడ్డారు. ప్రజారంజక పాలన అందిస్తున్న ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తే సహించేది లేదన్నారు. లింగ వివక్షను నిర్మూలించి బాలికల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహిళా అభివృద్ధి-శిశుసంక్షేమ, రోడ్లు, భవనాలశాఖల ప్రగతి నివేదికను మంత్రి విడుదల చేశారు.**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ప్రజారంజక పాలన అందిస్తున్న సీఎం కే చంద్రశేఖర్‌రావు సారథ్యంలోని ప్రభుత్వంపై బురదజల్లేందుకు ప్రయత్నిస్తే సహించేది లేదని విపక్షాలను రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. గురువారం ఆర్‌అండ్‌బీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమానికి పెద్దపీట వేసి పేదల కోసం ప్రభుత్వం పాటుపడుతున్న తీరు ప్రతిపక్షాలకు కంటగింపుగా మారిందన్నారు. ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, టీడీపీ, వామపక్షాలు చేస్తున్న దివాలాకోరు, దిగజారుడు రాజకీయాన్ని ప్రజలు గమనించి బుద్ధి చెబుతున్నారని అన్నారు. అర్థంపర్థం లేని పోరుయాత్రలు, పాదయాత్రలు చేసి కాళ్ల తిమ్మిరులు వదిలించుకోవడమే తప్ప ప్రజలు వారిని ఆదరించే పరిస్థితి లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన రెండున్నరేండ్ల కాలంలో ఇచ్చిన హామీలతోపాటు ప్రజల సంక్షేమం కోసం కొత్త కొత్త పథకాలను కూడా అమలు చేస్తున్నామని అన్నారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి పాల్గొన్నారు.

**మహిళా హెల్ప్‌లైన్ ఏర్పాటుకు సన్నాహాలు**

లింగ వివక్షను నిర్మూలించి బాలికల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తున్నదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. భ్రూణహత్యలు, లింగ వివక్షను నిర్మూలించడంలో భాగంగా 'భేటీ బచావో-భేటీ పడావో' పథకంపై విస్తృత ప్రచారం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. గురువారం మహిళా అభివృద్ధి-శిశుసంక్షేమ శాఖ కార్యదర్శి ఎం జగదీశ్, డైరెక్టర్లు విజయేంద్ర, శైలజ ఇతర అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో కోత పెట్టినప్పటికీ సీఎం కేసీఆర్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రజలకు సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రిగా కే చంద్రశేఖర్‌రావు నాయకత్వంలోని టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారం చేపట్టి రెండున్నర సంవత్సరాల కాలంలో మహిళా అభివృద్ధి-శిశుసంక్షేమ శాఖ సాధించిన ప్రగతి నివేదికను ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవితో కలిసి విడుదల చేశారు. మహిళా హెల్ప్‌లైన్ '181'ను రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి సన్నాహాలు జరుగుతున్నట్లు తెలిపారు. మహిళా సాధికారత కోసం భారత ప్రభుత్వం పూర్ణశక్తి కేంద్ర ప్రాజెక్టును నల్లగొండ జిల్లా దేవరకొండ మండలానికి మంజూరు చేసినట్లు తెలిపారు.



గురువారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతున్న రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, చిత్రంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి

**ప్రతి మండలానికి డబుల్‌లేన్ రోడ్డు**

తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన రెండున్నరేండ్ల కాలంలో రోడ్లు, భవనాలశాఖ ప్రగతి పథంలో దూసుకుపోతుందని రోడ్లు భవనాలశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆరు దశాబ్దాల్లో 2,573 కిలోమీటర్ల జాతీయ రహదారులను సాధించిన తెలంగాణ, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన రెండున్నరేండ్ల కాలంలో 2,656 కిలోమీటర్ల జాతీయ రహదారులను సాధించి రికార్డు సృష్టించిందన్నారు. గురువారం ఆర్‌అండ్‌బీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ శాఖ సాధించిన ప్రగతి నివేదికను మంత్రి తుమ్మల విడుదల చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.4 వేల కోట్లతో 8వేల కి.మీ రోడ్ల నిర్మాణం పూర్తి చేశామని, అలాగే రూ.250 కోట్ల అంచనా వ్యయంతో 51 వంతెనలను నిర్మించామని తెలిపారు. ప్రతీ మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ లేన్ల రోడ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు.

నమస్తే తెలంగాణ Fri, 02 December 2016
epaper.namasthetelangaana.com/c/15051434

## In Vaartha



# రోడ్లకు భారీగా నిధులు

**రాష్ట్రంలో రూ.4 వేల కోట్లతో 8 వేల కి.మీ. రోడ్ల నిర్మాణం**

**250 కోట్లతో 51 బ్రిడ్జిల పూర్తి**

**119 మంది ఎమ్మెల్యేల ఆఫీసుల నిర్మాణాలకు టెండర్లు: మంత్రి తుమ్మల**

**హైదరాబాద్, డిసెంబరు 1 ప్రభాతవార్త:** తెలంగాణలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఆర్అండ్‌బి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తమ శాఖ సాధించిన లక్ష్యాలను, రాష్ట్ర సిఎం కేసిఆర్ ప్రోద్బలంతో, వంతెనల నిర్మాణంలో సాధించిన విజయాలను వివరించారు. సిఎం కృషి, పట్టుదల వల్ల వివిధ పథకాల ద్వారా రాష్ట్రానికి లభించిన కేంద్ర సహకార అనుమతులు గురించి ప్రత్యేకంగా తెలిపారు. ఈవిషయంలో సిఎం అందించిన సహాయ, సహకారాలు, కృషి ప్రోద్బలం ఎనలేనివని ఆయన పొగిడారు. మొత్తం రెండు విడతల్లో కేంద్రం నుంచి సాధించిన జాతీయ రహదారుల నిడివి 2656 కి.మీ. రాష్ట్రం ఏర్పడకముందు ఉన్న 2573 కి.మీలకు ఇది అదనమని మంత్రి తెలిపారు. రాష్ట్రం

≫2



# రోడ్లకు భారీగా నిధులు

≫ రెండేళ్లలో సాధించిన 100% పురోగతికి ఇది తార్కాణమన్నారు. ఈ ఎన్‌హెచ్ అభివృద్ధి పథకాల కింద రాష్ట్రంలో 325 కి.మీ. పొడవుగల ఈరోడ్లకు కేంద్రం నుంచి రూ.2080 కోట్ల విలువగల పనులకు అనుమతులు ఇచ్చారన్నారు. రాష్ట్ర రహదారులను కూడా జాతీయ రహదారుల ప్రమాణాలతో నిర్మాణం, హరిత ప్రమాణాలకు పర్యావరణ హిత నిర్మాణాలకు అనువుగా తక్కడపల్లి-జుక్కల్ లాంటి అనేక రోడ్ల నిర్మాణం చేశామన్నారు.దక్షిణ భారతదేశంలోనే మొదటిసారిగా తీగలతో గోదావరి నదిపై పర్ణాశాల వద్ద, మానేరుపై కరీంనగర్ వద్ద వంతెనల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తుమ్మల పేర్కొనాన్రు. నీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ, పశు పక్ష్యాదుల తాగునీటి అవసరాలకి 150 రహదారుల్లో చెక్‌డ్యాంలతో వంతెనల నిర్మాణం చేపట్టామన్నారు. నేటికి రూ. 4వేల కోట్ల అంచనాలతో 8వేల కి.మీ. పొడవుగల రోడ్డు నిర్మాణం పూర్తయిందన్నారు. రూ.250 కోట్ల అంచనాతో 51 బ్రిడ్జిల నిర్మాణం పూర్తయిందన్నారు. కృష్ణా పుష్కరాలకు అతితక్కువ సమయంలో రూ.280 కోట్ల అంచనాతో 470 కి.మీ. నిడవిగల రోడ్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు. 5500కి.మీ. పొడవుగల రోడ్లు నిర్మాణంలో ఉన్నాయనీ, 280 వంతెనలు, ఆర్ఓబిలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. 119 మంది ఎమె ్మల్యేలకు రూ.119 కోట్ల అంచనాలతో కార్యాలయ-నివాస భవనాల నిర్మాణాలకు అంచనాలు సిద్ధం చేశామని.. ఈపనులకు టెండర్ల స్వీకరణ చేపడుతున్నామన్నారు. అలాగే కొత్తగా ఏర్పడిన 31 జిల్లాల ముఖ్యపట్టణాల్లో రూ.58.10 కోట్ల అంచనాలతో ఐబి గెస్ట్‌హౌజ్‌ల నిర్మాణం చేపడుతామన్నారు. ఇక శాఖలో నూతనంగా 2015లో 85 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లను, 2016లో 35మంది అసిస్టెంట్ ఇంజినీర్లను నియమించినట్లు మంత్రి వెల్లడించారు. 52 నూతన పదవులు సృష్టించి వీటికింద అధికారులను ప్రమోషన్స్‌పై నియమించామన్నారు. నూతనంగా 3 సర్కిల్స్ ఏర్పాటు నాణ్యత ఏర్పాటు, నాణ్యత నియంత్రణ విభాగం, జాతీయ రహదారల విభాగం, డిజైన్స్ ప్లానింగ్ విభాగాలను పటిష్టపరచామన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా 4ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల పదవులను సృష్టించి ఈకింది అధికారులను ఈపదవుల్లో ప్రమోషన్‌పై నియమించినట్లు తెలిపారు. ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ జాతీయ సదస్సును ఈనెల 15 నుంచి 18 వరకు నిర్వహిస్తున్నావ మంత్రి పేర్కొన్నారు.

## In Sakshi

# ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టలేరు: తుమ్మల



సాక్షి, హైదరాబాద్: గత ఎన్నికల వాగ్దానాలు నిలబెట్టుకుని మళ్లీ ఎన్నికలకు సిద్ధమయ్యే దిశగా ముందుకు సాగుతున్నామని, ఈ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టడం ఎవరి తరం కాదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రెండున్నరేళ్ల టీఆర్ఎస్ పాలన పూర్తయిన నేపథ్యంలో గురువారం రోడ్లు భవనాల శాఖ ఈఎన్సీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

**మరో ఏడు జాతీయ రహదారులకు అనుమతి**

కేంద్రం కొత్తగా ఏడు జాతీయ రహదారులకు అనుమతినిచ్చిందని మంత్రి తుమ్మల చెప్పారు. వాటి వివరాలను విడుదల చేశారు. మన్నెగూడ- కొడంగల్-కర్ణాటక సరిహద్దు వరకు 72 కి.మీ. రోడ్డుకు రూ.359.27 కోట్లు, కల్వకుర్తి-మల్లేపల్లి సెక్షన్, 47 కి.మీ., రూ.319.23 కోట్లు, జడ్చర్ల కల్వ కుర్తి సెక్షన్, 47.35 కి.మీ., రూ.314.53 కోట్లు, జనగామ-తిరుమలగిరి సెక్షన్, 39.18 కి.మీ., రూ.196.51 కోట్లు, తిరుమలగిరి- సూర్యాపేట సెక్షన్, 43.78 కి.మీ., రూ.244.54 కోట్లు, నకిరే కల్-తానంచెర్ల 71.6 కి.మీ., రూ.615.02 కోట్లు, హగ్గరి-జడ్చర్ల రోడ్డులో మరికల్ నుంచి కర్ణాటక సరిహద్దు వరకు రూ.218 కోట్లు, ఎన్‌హెచ్ 63లో జైపుర్ నుంచి కర్ణాటక సరిహద్దు వరకు రూ.228 కోట్లు, మహబూబ్‌నగర్ పట్టణ పరిధిలో డ్రెయిన్స్ ఏర్పాటుకు రూ.31 కోట్లు.

సాక్షి
SAKSHI TELUGU DAILY
Fri, 02 December 2016
epaper.sakshi.com//c/15097166

## In Andhra Jyothi

# సీఎం కేసీఆర్ పేదల పక్షం

**రాజకీయ అక్కసుతోనే విపక్షాల విమర్శలు.. రాష్ట్రంలో ఆ పార్టీలకు పుట్టగతులుండవ్**

- **రెండున్నరేళ్లుగా ప్రణాళికాబద్ధ అభివృద్ధి**
- **సంక్షేమంలోనూ ఎంతో ప్రగతి: తుమ్మల**



హైదరాబాద్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత రెండున్నరేళ్లుగా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి జరుగుతోందని, రానున్న రోజుల్లో కూడా మరింత ప్రగతి సాధించడం జరుగుతుందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు కేవలం రాజకీయ అక్కసుతోనే అర్థంలేని విమర్శలు చేస్తున్నాయని, వారు తమ తీరు మార్చుకోకపోతే రాష్ట్రంలో పుట్టగతులుండవని హెచ్చరించారు. గురువారం ఎర్రమంజిల్‌లోని ఈఎన్‌సీ భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రెండున్నరేళ్లలో రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధికి తీసుకున్న చర్యలను వివరించారు. స్వయంగా ముఖ్యమంత్రే పేదల పక్షమైనప్పుడు.. సీఎం పక్షమా? లేక పేదల పక్షమా? అనే వాదన అర్థంలేనిదని ఆయన పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నిత్యం పేదల కోసం పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో రెండు విడతల్లో 2656 కి.మీల రోడ్లను జాతీయ రహదారులుగా కేంద్రం గుర్తించిందని, రెండేళ్లలో ఇది వంద శాతం ప్రగతి అని చెప్పారు. జాతీయ రహదారుల అభివృద్ధికి కేంద్రం రూ.2 వేల కోట్ల విలువ గల అనుమతులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని, తాజాగా ఏడు రోడ్ల అభివృద్ధికి రూ. 2080 కోట్లను విడుదల చేస్తున్నట్లు ప్రకటించిందని తెలిపారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో 26 రోడ్లు, 5 బ్రిడ్జిల నిర్మాణానికి రూ.1590 కోట్లు ఇచ్చినట్లు చెప్పారు. ప్రతి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి రెండు వరుసల రహదారి నిర్మాణం, 451 మండల కేంద్రాలకు 1884 కి.మీ పొడవు నిడివితో రూ. 2518 కోట్ల అంచనాలతో 139 రోడ్ల పనులను చేస్తున్నట్లు చెప్పారు. రూ. 6064 కోట్లతో 4314 కి.మీల 459 రాష్ట్ర రహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అలాగే రూ.1545 కోట్ల అంచనాతో 319 వంతెనలను కూడా చేపట్టినట్లు వివరించారు. ఇప్పటికే రాష్ట్రంలో రూ.4 వేల కోట్ల వ్యయంతో 8వేల కి.మీ రోడ్లను అభివృద్ధి చేసినట్లు, పలు భవనాల నిర్మాణం, హరితహారం, రోడ్డు భద్రతా ఇంజనీరింగ్ పనులను చేపట్టినట్లు చెప్పారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఇండియన్ రోడ్స్ కాంగ్రెస్ పేరిట హైదరాబాద్‌లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు.

### సంక్షేమానికి అన్ని చర్యలు..

టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి తెలంగాణ రాష్ట్రంలో వివిధ వర్గాల సంక్షేమంతోపాటు మహిళ, శిశు, వికలాంగ సంక్షేమంలోనూ ఎంతో ప్రగతి సాధించినట్లు ఆ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గడిచిన రెండేళ్లకు పైగా కాలంలో ఈ శాఖల సంక్షేమంపై ప్రగతి నివేదికలను గురువారం ఆయన విడుదల చేశారు.

ఆంధ్రజ్యోతి
Fri, 02 December 2016
epaper.andhrajyothy.com/c/15051621